సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ı 1 ı ఆగస్టు ı 2025



అడ్మిషన్లపై అటానమస్ ఎర !

లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో పలువురు విద్యార్థులు అడ్మిషన్లు రద్దు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. 8లో



'దిగుబడి'.. తిరగబడి

ఈ ఏడాది ఆయిల్‌పామ్ దిగుబడితో పాటు ధర కూడా తగ్గడంతో నష్టాల పాలవుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, చిత్త నక్షత్రాన్ని పురస్కరించుకుని ఘనంగా సుదర్శన హోమం జరిపించారు.

రామయ్యను దర్శించుకున్న ఆర్టీఐ కమిషనర్లు..

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని ఆర్టీఐ కమిషనర్లు పి.వి.శ్రీనివాసరావు, బి.అయోధ్యరెడ్డి, డి.భూపాల్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్‌కుమార్, వేద పండితులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, వేద పడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.


పరిశుభ్రత పాటించాలి



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న సభ్యులు

దమ్మపేట : పాఠశాలలో విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పథకం కేంద్ర బృందం సభ్యురాలు రేవతి అన్నారు. మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బృందం సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ.. శారీరక పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా తప్పనిసరిగా పాటించాలన్నారు. మరుగుదొడ్లను వినియోగించాలని, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పంచాయతీ ట్రాక్టర్ ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి చెత్త సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో స్వచ్ఛత, పచ్చదనం, ఇంకుడు గుంతల నిర్మాణం తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బజ్జూరి సరళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు నీటిమూటలే!





అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట (ఇన్‌సెట్) టేకులపల్లి మండలం బొమ్మనపల్లి వద్ద రాజీవ్‌సాగర్ కోసం వేసిన పైపులు(ఫైల్)

రాజీవ్ సాగర్ ఆయకట్టుకు మళ్లీ మొండిచేయి

- సీతారామలో కలిసిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్
- ఇందిరాసాగర్ ఆయకట్టుపైనే ప్రభుత్వ దృష్టి
- గాలికొదిలేసిన రాజీవ్ సాగర్ ఆయకట్టు
- అంచనాల వ్యయం పెంపులోనూ అదే తీరు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జలయజ్ఞంలో భాగంగా 2005 డిసెంబర్‌లో దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి రాజీవ్‌సాగర్ ప్రాజెక్టును ప్రారంభించారు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి గోదావరి నీటిని కొత్తగూడెం, ఇల్లెందుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు అందించేందుకు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రూపకల్పన చేశారు. రాష్ట్ర విభజన జరిగే నాటికి రాజీవ్ సాగర్ నిర్మాణ వ్యయం దాదాపు రూ.1,700 కోట్లు కాగా.. అప్పటికే భూసేకరణ, పైపుల కోసం దాదాపు రూ.900 కోట్ల మేర ఖర్చు చేశారు. ఇదే సమయంలో అశ్వారావుపేట, సత్తుపల్లితో పాటు ఏపీలోని జంగారెడ్డిగూడెం, చింతలపూడి నియోజకవర్గాల్లో కొంత భాగానికి సాగునీరు అందించేందుకు ఇందిరాసాగర్ ప్రాజెక్టును చేపట్టారు. అయితే గోదావరి నుంచి నీటిని తీసుకునే వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామం రాష్ట్ర విభజన అనంతరం ఏపీలోకి వెళ్లడంతో ఈ ప్రాజెక్టు రద్దయింది. దీంతో రాజీవ్ సాగర్‌లో ఇందిరా సాగర్‌ను విలీనం చేస్తూ సీతారామ ప్రాజెక్టును భుజాలకు ఎత్తుకున్నారు.

రాజీవ్ సాగర్ మాయం..

సీతారామ ప్రాజెక్టుకు 2016లో శ్రీకారం చుట్టారు. నాటి అంచనాల ప్రకారం.. దుమ్ముగూడెం వద్ద గోదావరి నుంచి ఎత్తిపోసిన నీటిని కిన్నెరసానికి తరలించి, అక్కడి నుంచి అనిశెట్టిపల్లి మీదుగా టేకులపల్లి మండలం రోళ్లపాడు దగ్గర నిర్మించే 16 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా బయ్యారం పెద్ద చెరువు మీదుగా పాలేరు జలాశయం వరకు నీరు తరలిస్తారు. దీంతో ఇల్లెందు, వైరా, పాలేరు, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల పరిధిలో కొత్త ఆయకట్టు వచ్చేందుకు అవకాశం ఉండేది. కానీ కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాక్‌లు అడ్డుగా ఉన్నాయంటూ మళ్లీ ఈ ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. ఈ క్రమంలో రోళ్లపాడు రిజర్వాయర్‌ను ఎత్తేశారు. ఫలితంగా ఇల్లెందు, వైరా (కారేపల్లి)తో పాటు డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు గోదావరి నీరందే పరిస్థితి లేకుండా పోయింది.

అంచనా వ్యయం పెంపు..

రీ డిజైన్ అనంతరం దుమ్ముగూడెం నుంచి ఎత్తిపోసిన నీరు 104 కి.మీ. ప్రధాన కాల్వ వెంట ప్రయాణించిన తర్వాత ములకలపల్లి మండలం కమలాపురం వద్ద సత్తుపల్లి ట్రంక్ కెనాల్ వైపు ఒక కాల్వ, పాలేరు వైపు మరో కాల్వ చీలిపోతాయి. సత్తుపల్లి వైపు యాతాలకుంట టన్నెల్, పాలేరు వైపు బీరోలు, జూలూరుపాడు టన్నెళ్లు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం యాతాలకుంట టన్నెల్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. వచ్చే సీజన్‌కు నీరందించే అవకాశం ఉంది. నిధుల గ్రహణం, అనుమతుల జాప్యంతో జూలూరుపాడు టన్నెల్ పనులు ప్రారంభమే కాలేదు. బీరోలు పనులు మధ్యలో ఆగిపోయాయి. మరోవైపు ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2016లో రూ.7,926 ఉండగా ఆ తర్వాత రీడిజైన్ల కారణంగా 2018లో రూ.13,057 కోట్లకు పెంచారు. తాజాగా ఈ అంచనా వ్యయాన్ని రూ.19,325 కోట్లకు పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటి వరకు రూ.7,919 కోట్లు ఖర్చు చేశారు. అంటే 2016లో ప్రాజెక్టు మొదలు పెట్టినప్పటి అంచనా వ్యయానికి సమానమైన ఖర్చు చేసినా ఇప్పటి వరకు కొత్తగా ఒక ఎకరం కూడా సాగులోకి రాలేదు.

'రాజీవ్' ఊపిరి తీసి.. 'ఇందిరా'కు ప్రాణం పోశారు..

ప్రస్తుత సీతారామ పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే దుమ్ముగూడెం నుంచి తీసుకునే గోదావరి నీరు రాజీవ్ సాగర్ ఆయకట్టు దిశగా ప్రవాహానికి బదులు గతంలో ప్రతిపాదించి, రద్దయిన ఇందిరాసాగర్ ఆయకట్టు దిశకే మళ్లాయి. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి గోదావరి జలాల ద్వారా సత్తుపల్లి, అశ్వారావుపేటలో కొత్త ఆయకట్టు రానుంది. మరోవైపు రాజీవ్ కెనాల్ ద్వారా ఖమ్మం జిల్లాలోని నాగార్జున సాగర్ ఆయకట్టుకు భరోసా దక్కింది. కానీ 2005 నుంచి 2015 వరకు ఇబ్బందులు లేకుండా ముందుకు సాగిన రాజీవ్ సాగర్ ప్రాజెక్టు, దాని కింద ఆయకట్టు మొత్తానికే మాయమైంది. కంటి తుడుపు చర్యగా ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల కోసం రూ.3,200 కోట్లతో ప్రత్యేక పనులు చేపట్టేలా డీపీఆర్ రూపొందించారు. కానీ, ప్రస్తుత అంచనాల వ్యయం పెంపులో దీనికి చోటు దక్కలేదు. ఇటీవల దేవాదుల ద్వారా పాకాల, బయ్యారం నుంచి ఇల్లెందుకు నీరు అందిస్తామని చెబుతున్నా.. స్పష్టమైన కార్యాచరణ లేదు. మొత్తంగా ఇల్లెందుకు గోదావరి నీరు ఇస్తామంటూ పాలకులు చెబుతున్న మాటలు 20 ఏళ్లు గడిచినా నీటి మూటలుగానే మిగిలాయి.

ఆర్టీఐ.. ప్రజల ప్రాథమిక హక్కు

- ప్రభుత్వం – ప్రజలకు మధ్య అధికారులు జవాబుదారీగా ఉండాలి
- ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి



కమిషనర్లకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ రోహిత్‌రాజు, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కని, దాన్ని కాపాడేందుకు అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలని ఆర్టీఐ ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి సూచించారు. జిల్లాలో సమాచార హక్కు చట్టం అమలుతీరును సమీక్షించేందుకు రెండు రోజుల పర్యటనలో భాగంగా అయోధ్యరెడ్డితో పాటు సహ కమిషనర్లు దేశాల భూపాల్, పి.వి. శ్రీనివాసరావు గురువారం జిల్లాకు వచ్చారు. వారికి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఆ తర్వాత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమావేశంలో అయోధ్యరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్టీఐ చట్టం సమర్థవంతంగా అమలు కావడం హర్షణీయమని అన్నారు. చట్టంపై అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలన లక్ష్యంగా ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు జవాబుదారీతనం ఎంత అవసరమో, పారదర్శకత కూడా అంతే ముఖ్యమని, ఆర్‌టీఐ యాక్ట్ ద్వారా పూర్తి సమాచారం అందించినప్పుడే ఈ రెండింటికీ సార్థకత చేకూరుతుందని వివరించారు. సమాచార హక్కు చట్టం 136 దేశాలలో అమలవుతోందని తెలిపారు. రాష్ట్రంలో 29 ప్రభుత్వ శాఖలు ఉండగా, 15 శాఖల్లో ఎలాంటి కేసులు లేకపోవడం హర్షణీయమని అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 18వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, 2026 మార్చి నాటికి అన్నింటినీ పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి..

ఆర్టీఐ కేసుల పరిష్కారంలో అధికారులు సమష్టిగా కృషి చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సహ కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆర్టీఐ చట్టంలో 30 సెక్షన్లు మాత్రమే ఉన్నాయని, అధికారులు సులభంగా అర్థం చేసుకోవచ్చని అన్నారు. 'ఈ చట్టంలో ఆదేశించేది మనమే.. అమలు చేసేదీ మనమే'నని వ్యాఖ్యానించారు. న్యాయమూర్తులు కూడా ఈ చట్టం పరిధిలోకి వస్తారని తెలిపారు. ఆర్టీఐ కేసుల పరిష్కారంలో ప్రపంచంలో దేశం 8వ ర్యాంకులో ఉందని తెలిపారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. చట్టంపై పూర్తి అవగాహనకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. నిబంధనలకు లోబడి సమాచారం అందించేలా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వివరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్, సీపీఓ సంజీవరావు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

నాబార్డ్ ఏజీఎం సుజీత్‌కుమార్



మొక్క నాటుతున్న ఏజీఎం సుజీత్‌కుమార్

అశ్వారావుపేటరూరల్ : సహకార సంఘాలను బలోపేతం చేసుకోవాలని నాబార్డ్ ఉమ్మడి జిల్లా ఏజీఎం సుజీత్ కుమార్ అన్నారు. మండలంలోని నారాయణపురం సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావుతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సహకార సంఘం ద్వారా పంట రుణాలు అందిస్తున్నామని చెప్పారు. మరో వైపు వ్యాపార రంగాన్ని కూడా విస్తరిస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్‌ల బలోపేతానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఈఓ అంబటి అరుణ, రైతులు వనపర్తి మోహన్‌రావు, సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ పాటిల్

కొత్తగూడెంఅర్బన్ : ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలని, ఈ మేరకు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, ఔషధ నిల్వలు తదితర అంశాలను పరిశీలించారు. ఆపరేషన్ గదిలో మందులు నిల్వ ఉంచడాన్ని గమనించి.. ఇక్కడ ఎందుకు నిల్వ చేశారు, ఆపరేషన్ థియేటర్ ఉపయోగిస్తున్నారా అని వైద్యులను ప్రశ్నించారు. మూడు నెలలకు సరిపడా మందులు ముందస్తుగా నిల్వ చేసేందుకు తగిన స్థలం లేక ఇక్కడ ఉంచామని వైద్యులు తెలిపారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సిబ్బందిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతీ బాధితుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందాలంటే వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలతో వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ఉంటాయని, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో నాటిన మునగ, కరివేపాకు, ఉసిరి మొక్కలను పరిశీలించిన కలెక్టర్.. మిగతా ఖాళీ ప్రదేశంలోనూ ఇవే మొక్కలు నాటాలని చెప్పారు.

బడిలో.. బయోమెట్రిక్

- నేటి నుంచి ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు
- ఆదేశాలు జారీ చేసిన ఉన్నతాధికారులు
- ఇంకా డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ దశలోనే ప్రక్రియ
- విద్యార్థులకు మేలు కలుగుతుందనే భావన



కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుల గైర్హాజరు, మండల, జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోందనే ఆరోపణలు వస్తుండగా.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు సర్కారు దశల వారీగా పలు పథకాలు అమలు చేస్తోంది. ఉపాధ్యాయులు కూడా సక్రమంగా పాఠశాలకు వచ్చి విద్యాబోధన చేస్తే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ కొందరు ఉపాధ్యాయులు యూనియన్లు, రాజకీయ పార్టీల అండతో పాఠశాలకు రాకుండానే హాజరు వేసుకుంటున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండానే హాజరు వేసుకుంటుండడం ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరుగుతుందనుకుంటే పొరపాటే. కొత్తగూడెం జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల మండలాల్లోనూ ఈ తంతు సాగుతోందనే విమర్శలు వస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు తనిఖీ చేస్తే ఈ విషయం బయటపడే అవకాశం ఉన్నా.. వారి పరిశీలన సైతం అంతంతగానే ఉంటోంది. ఇకపై ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం నుంచే ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నైజేషన్) ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశించింది.

ఇంకా డౌన్‌లోడ్ కాని యాప్..

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే బోధన, బోధనేతర సిబ్బంది అందరూ ఇకపై ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియను అనుసరించాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 1 నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. అయితే జిల్లాలో ఇంకా ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే దశలోనే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు. దీంతో జిల్లాలో శుక్రవారం ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం కనిపించడం లేదు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ చేసి రాష్ట్ర ఉన్నతాధికారులతో అనుసంధానం చేయించుకోవాలి. అనంతరం స్కూల్ ఆవరణలోనే ఉదయం, సాయంత్రం హాజరు వేయాల్సి ఉంటుంది.

అవకతవకలకు చెక్ పెట్టేలా..

బోధన, బోధనేతర సిబ్బందికి ముఖ గుర్తింపు హాజరు పడితే సరిపోతుందని మొదట అధికారులు వెల్లడించారు. అయితే సిబ్బంది ఇతర ప్రాంతాల్లో ఉండి కూడా బయోమెట్రిక్ ద్వారా హాజరు వేసుకునే అవకాశం ఉంటుందని భావించిన ఉన్నతాధికారులు.. పాఠశాల ఆవరణలో హాజరు వేస్తేనే పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించారు. దీంతో అవకతవకలకు చెక్ పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ గుర్తింపు వివరాలు ఎలా నమోదు చేసుకోవాలనే అంశంపై ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఈ విధానం ద్వారా అనుమతి లేకుండా గైర్హాజరు కావడం, పాఠశాలకు ఆలస్యంగా రావడం, సమయానికంటే ముందే వెళ్లిపోవడం వంటివి నిరోధించ వచ్చని, తద్వారా పిల్లలకు నాణ్యమైన విద్య అందించే అవకాశం ఉంటుందని అంటున్నారు.

పారదర్శకత పెరుగుతుంది



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియతో పారదర్శకత పెరుగుతుంది. అవకతవకలకు అవకాశం లేకుండా, ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో మెరుగైన బోధన జరిగి విద్యార్థులకు మేలు కలుగుతుంది.

– నాగ రాజశేఖర్, విద్యాశాఖ జిల్లా కో – ఆర్డినేటర్

సింగరేణి ప్రధాన కార్యాలయంలోనూ..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల హాజరు నమోదు కోసం శుక్రవారం నుంచి ఫేస్ రికగ్నైజ్ సిస్టమ్ అమల్లోకి రానుంది. ఇప్పటికే కార్యాలయంలో విధులు నిర్వర్తించే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎఫ్‌ఆర్‌ఎస్ బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటుచేశారు. ఈ మేరకు ఉద్యోగులందరూ ఇన్, ఔట్ హాజరును ఈ యంత్రాల ద్వారా నమోదు చేయాలని యాజమాన్యం సూచించింది.



సింగరేణి కార్యాలయంలోని ఎఫ్‌ఆర్‌ఎస్ మిషన్

బీజీ కొత్తూరులో 'నవోదయ'

- 30 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- త్వరలోనే విద్యాలయ భవనం పనులు ప్రారంభించేందుకు కసరత్తు



నవోదయ విద్యాలయానికి భూమి కేటాయిస్తూ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ మణిధర్(ఫైల్)

అశ్వాపురం: మండలంలోని బీజీ కొత్తూరులో జవహర్‌నవోదయ విద్యాలయం ఏర్పాటు కానుంది. నవో దయ విద్యాలయం నిర్మాణానికి 30 ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఇటీవల సంబంధిత అధికారులకు అప్పగించారు. ప్రస్తుతం కన్సల్టెంట్ టెండర్లు పూర్తి కాగా సుమారు రూ.70 కోట్లతో విద్యాలయం భవనం నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో తొలి నవోదయ విద్యాలయం..

అప్పట్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయం ఉండగా తరువాత భద్రాచలంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేశారు. రాష్ట్రవిభజనలో అది ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లగా జిల్లాలో నవోదయ విద్యాలయం లేకుండాపోయింది. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో నవోదయ విద్యాలయం ఏర్పాటుతో జిల్లాలో తొలి నవోదయ విద్యాలయం కానుంది.

2022లో మంజూరు..

గత ప్రభుత్వ హయాంలో 2022లో కేంద్ర ప్రభు త్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేసింది. పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలం బీజీ కొత్తూ రు వద్ద నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయా లని భావించారు. బీజీ కొత్తూరులో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించి విద్యాలయానికి కేటాయిస్తూ సంబంధిత అధికారులకు నివేదించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు భూమిని సందర్శించారు. బీజీ కొత్తూరు నుంచి నవోదయ విద్యాలయం వరకు రూ.1.50 కోట్లతో రహదారికి అప్పటి ఎమ్మెల్యే రేగా కాంతారావు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. నవోదయ విద్యాలయం ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో నవోదయ విద్యాలయం ఏర్పాటవుతుందా లేదా ఇతర ప్రాంతాలకు తరలిస్తారా అన్న సందేహాలు స్థానికుల నుంచి వ్యక్తమయ్యాయి. గతంలో గుర్తించిన 30 ఎకరాల భూమినే నవోదయ విద్యాలయానికి కేటాయిస్తూ భూమిని అప్పగించడంతో నవోదయ విద్యాలయం ఏర్పాటు కల నెరవేరబోతోందని ఈ ప్రాంత విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది నుంచే తరగతులు..

ఈ ఏడాది నుంచే జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభం కానుంది. తొలుత ఆరో తరగతిలో 40 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు కరకగూడెంలో తాత్కాలికంగా ఓ అద్దె భవనంలో తరగతులు నిర్వహించనున్నారు. బీజీ కొత్తూరు వద్ద విద్యాలయం నిర్మాణ పనులు పూర్తి కాగానే తరువాత విద్యాలయాన్ని ఇక్కడికి తరలిస్తారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- సీసీఎఫ్, డీఎఫ్‌ఓ, సింగరేణి డైరెక్టర్ పిలుపు
- కేఓసీలో ఘనంగా వన మహోత్సవం



మొక్క నాటుతున్న అటవీ, సింగరేణి అధికారులు

టేకులపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్ పిలుపునిచ్చారు. 'తల్లి పేరుతో ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్, సింగరేణి డైరెక్టర్(పీపీ) కె.వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం ఆయన కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లోని డంప్ యార్డు వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చని సూచించారు. సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి సంస్థ ప్రతీ సంవత్సరం వేల ఎకరాల్లో మొక్కలు నాటుతోందని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓలు కోటేశ్వరరావు, కృష్ణమాచారి, కొత్తగూడెం, ఇల్లెందు ఏరియా జీఎంలు శాలేంరాజు, వి.కృష్ణయ్య, ఎస్ ఓ టు జీఎం రామస్వామి, కేఓసీ పీఓ గోవిందరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ శివశంకర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ బి. శ్యాంప్రసాద్, వెంకటేశం, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే ఉపాధ్యాయుడైన వేళ..!



పాఠం బోధిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠం బోధించడమే కాక చిన్నారులచే అక్షరాలు దిద్దించారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలతో పాటు ఇదే ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠం బోధించి, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నేలపై కూర్చొని అక్షరాలు దిద్దించారు. అనంతరం వారికి అందిస్తున్న పోషకాహారం, వంట సరుకులు పరిశీలించారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి పాముకాటు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్(దమ్మపేట)లో గల ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఇంగ్లిష్ అధ్యాపకురాలు భవానీ గురువారం పాముకాటుకు గురైంది. గమనించిన తోటి సిబ్బంది వెంటనే అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగానే ఉన్నట్లు తోటి సిబ్బంది చెప్పారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు..

గురుకుల డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న కొత్త మెనూ ఏడాది కావొస్తున్నా.. అమలు చేయడం లేదని, కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వాన్నంగా ఉందని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ ఫిర్యాదును ఖమ్మం ఆర్సీఓ అరుణకు పంపించి, విచారణ చేయవల్సిందిగా ఆమెను ఆదేశించారు.

తూరుబాక పంచాయతీలో వివాదం

- మల్టీపర్పస్ వర్కర్లను వద్దన్నందుకు వాగ్వాదం
- నెలపాటు పనులకు రావొద్దని ఎంపీఓ సూచన

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి, మల్టీపర్పస్ వర్కర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. పంచాయతీలో కేంద్ర బృందం పర్యటన నేపథ్యాన పంచాయతీని శుభ్రంగా ఉంచేందుకు కార్యదర్శి, వర్కర్లు పనులు చేస్తున్నారు. ఈనేపథ్యాన మంగళవారం డంపింగ్ షెడ్ వద్ద మల్టీ పర్పస్ వర్కర్లు ఉదయమే పనులు పూర్తి చేయగా.. ఘటన స్థలానికి వచ్చిన కార్యదర్శి మీకు పని చేయడం రాదని అనడంతో ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లు అక్కడి నుంచి వెళ్లిపోయాడు కాని మిగతా ఇద్దరు సాయంత్రం వరకు పని చేశారు. మరుసటి రోజు బుధవారం కొత్త వ్యక్తులతో పంచాయతీ కార్యదర్శి పనులు చేయించారు. అలాగే గురువారం కూడా పాతవారిని పిలవకపోవడంతో వారు పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా.. తాము కొత్త వాళ్లను పెట్టుకున్నామని చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని ఎంపీఓ రామకృష్ణ దృష్టికి పంచాయతీ కార్యదర్శి తీసుకెళ్లగా.. ఆయన అక్కడకు వెళ్లి ఒక నెల రోజుల పాటు విధులకు దూరంగా ఉండండని మల్టీ పర్పస్ వర్కర్లకు సూచించినట్లు తెలపగా.. వివాదం మరింత తీవ్రతరం అయినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎంపీఓ రామకృష్ణను వివరణ కోరగా.. మల్టీపర్పస్ వర్కర్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని, పంచాయతీలో కేంద్ర బృందం సర్వే ఉన్న నేపథ్యాన పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కొత్తవారిని నియమించినట్లు తెలిపారు. వారిని ఒక నెల రోజుల పాటు పనులకు దూరంగా ఉండమని సూచించినట్లు తెలిపారు.

నాట్లు వేస్తుండగా గుండెపోటుతో రైతు మృతి



బండారు పుల్లయ్య (ఫైల్)

కొణిజర్ల: వరి నార్లు వేస్తుండగా గుండెపోటు రావడంతో ఓ రైతు మృతి చెందాడు. కొణిజర్లకు చెందిన బండారు పుల్లయ్య(63) గురువారం తన పొలంలో నారు కట్టలు పరిచేందుకు వెళ్లాడు. నార్ల కట్టలు మోస్తుండగా గుండెపోటుకు గురైన ఆయన కన్నుమూశాడు. పుల్లయ్యకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, సీపీఐలో కొనసాగుతున్న ఆయన మృతదేహం వద్ద జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు గడల భాస్కర్, ఎర్రా బాబు, దొండపాటి రమేష్, స్వర్ణ రమేష్, తోటపల్లి సీతారాములు, తాటి వెంకటేశ్వర్లు, తాటి నిర్మల, లతాదేవి, కళావతి నివాళులర్పించారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.17,463

దిగుబడి.. తిరగబడి!



అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో దిగుమతి చేయబడిన గెలలు (ఫైల్)

ఆయిల్‌పామ్ ప్రాభవానికి మసక

- తగ్గిన పంట దిగుబడి
- టన్నుకు రూ.3వేలు నష్టం
- కారణం తెలియక రైతుల ఆందోళన
- నష్టపోకుండా చూడాలని వేడుకోలు

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని దమ్మపేట మండలంలో ఈ ఏడాది ఆయిల్‌పామ్ దిగుబడి గణనీయంగా తగ్గిందని సాగు చేసిన చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక ఒక టన్ను పామాయిల్ గెలల ధర రూ.20 వేల పైచిలుకు నుంచి క్రూడ్ ఆయిల్‌పై దిగుమతి సుంకం తగ్గడంతో ఒక్కసారిగా రూ.17 వేలకు పడిపోవడంతో రైతులు నిరాశజనకంగా ఉన్నారు. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు ఒక ఎకరానికి ఒక టన్ను నుంచి రెండు టన్నుల మేర దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. కాగా, ఈ దిగుబడి తగ్గడానికి గల కారణాలు పూర్తిగా తెలియరాలేదని పేర్కొంటున్నారు.

దిగుబడి ఇలా..

పామాయిల్ మొక్కలను నాటిన తర్వాత నాలుగేళ్ల నుంచి గెలల దిగుబడి ప్రారంభమవుతుంది. మొదటి మూడేళ్లలో పోషక విలువలతో కూడిన ఎరువులు, మొక్కకు సరిపడా నీటిని అందించడం తదితర యాజమాన్య పద్ధతులను సరైన సమయాన పాటిస్తే నాల్గవ ఏడాది నుంచి దిగుబడి పొందవచ్చు. ఇలా ప్రారంభమైన దిగుబడి ఆరవ ఏడాది వరకు ఏడాదికి ఒక ఎకరానికి సగటున మూడు నుంచి నాలుగు టన్నుల ఆయిల్‌పామ్ గెలల దిగుబడి వస్తుంది. ఏడవ సంవత్సరం నుంచి తొమ్మిదవ సంవత్సరం వరకు ఐదు నుంచి ఎనిమిది టన్నులు, పదవ సంవత్సరం నుంచి తొమ్మిది నుంచి పది టన్నులు పైచిలుకు దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. ఇలా ముప్పై ఏళ్ల వరకు దిగుబడి పొందవచ్చు.

కాలానుగుణంగా మార్పులు..

పామాయిల్ దిగుబడి అనేది కాలానుగుణంగా మారుతుంది. వేసవికాలంలో దిగుబడి తక్కువగా ఉండి వర్షాకాలం, శీతాకాలాల్లో ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు పదేళ్ల వయసున్న పామాయిల్ తోట, వేసవికాలంలో ఒక ఎకరాకు 6 టన్నుల వరకు దిగుబడి ఇస్తే, వర్షాకాలం, శీతాకాలాల్లో 10 టన్నుల పైచిలుకు ఇచ్చే అవకాశం ఉంది. మేలైన యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే ఇదే కాలంలో సగటున సంవత్సారానికి 10 టన్నుల గెలల దిగుబడి పొందొచ్చు.

దిగుబడి తగ్గడానికి కారణాలు

వాతావరణ మార్పులు, అడవుల నిర్మూలన, వ్యాధులు, వైరస్ తెగుళ్లు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణలలో లోపాలు వంటి పలు అంశాలు పామాయిల్ దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణాలు. కాగా, వాతావరణంలో అనూహ్యంగా వచ్చిన మార్పులు పంట దిగుబడిని ప్రభావితం చేసి ఉండవచ్చనే ఆలోచన రైతుల్లో ఉంది. మండలంలో పామాయిల్ సాగులో దాదాపుగా 30ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న రైతులే ఉన్న కారణంగా యాజమాన్య, సస్యరక్షణ పద్ధతుల్లో లోపం వచ్చే అవకాశం దాదాపుగా ఉండదని, ఒకవేళ ఉంటే వాటిపై రైతులకు సంబంధిత అధికారులు తగు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గెలలు.. వాహనాల బారులు



ఫ్యాక్టరీ వద్ద బారులుదీరిన ట్రాక్టర్లు

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ గెలల లోడుతో అశ్వారావుపేట ఫ్యాక్టరీకి వస్తున్న ట్రాక్టర్లు బారులుదీరుతున్నాయి. గడిచిన మూడు రోజులుగా ఫ్యాక్టరీకి భారీగా గెలలు తీసుకొస్తుండగా.. ఫ్యాక్టరీ వద్ద గల ప్లాట్‌ఫామ్ గెలలతో నిండిపోయింది. దీంతో దిగుమతి చేసేందుకు స్థలం లేక ఆలస్యమవుతుండడంతో రోడ్డు పొడవునా గెలలతో ట్రాక్టర్లు పోటెత్తాయి. దాదాపు 70 నుంచి 80 ట్రాక్టర్లు రోడ్డుపై ఉండాల్సి వస్తుండగా.. ఒక్కో ట్రాక్టర్ దిగుమతికి రెండు గంటలపైనే పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గురువారం ఫ్యాక్టరీ వద్ద ట్రాక్టర్లు బారులుదీరగా.. 'సాక్షి'తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

దిగుబడి తగ్గింది..



దమ్మపేటలో గత 15 ఏళ్ల క్రితం 10 ఎకరాల్లో పామాయిల్ తోట వేశాను. గతేడాది సగటున ఒక ఎకరానికి 10 టన్నుల చొప్పున దిగుబడి వచ్చింది. కానీ ఈ ఏడాది ఆరు నుంచి ఏడు టన్నులు మాత్రమే వస్తుంది. వ్యాధులు, వైరస్ తెగుళ్ల వంటి కారణాలు సోకి ఉండొచ్చు. దిగుబడి తగ్గడానికి గల కారణాలను సంబంధిత అధికారులు అధ్యయనం చేసి రైతులు నష్టపోకుండా తోడ్పాటు అందించాలి.

– చిన్నశెట్టి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్, దమ్మపేట

ఆర్థికంగా నష్టపోయా..



ఈ ఏడాది పామాయిల్ దిగుబడి తగ్గడంతో పాటు ధర ఒక్కసారిగా రూ.20వేల నుంచి రూ.17 వేలకు పడిపోయింది. దీంతో నేను ఆర్థికంగా నష్టపోయా. నాకు 11 ఏళ్ల వయసు గల నాలుగు ఎకరాల పామాయిల్ తోట గలదు. వాస్తవానికి ఒక ఎకరానికి సగటున 10 నుండి 12 టన్నుల గెలల దిగుబడి రావాల్సి ఉండగా నాకు ప్రస్తుతం ఎనిమిది టన్నులు మాత్రమే వస్తుంది.

– కారుమంచి విజయ్‌కుమార్, పామాయిల్ రైతు, అప్పారావుపేట

కారణాలు తెలుసుకుంటాం..



పామాయిల్ పంటలో గెలల దిగుబడి తగ్గడానికి గల కారణాలను పూర్తిస్థాయిలో తెలుసుకుంటాం. వాతావరణంలో అనూహ్య మార్పులతో పంట దిగుబడిపై ప్రభావం చూపింది. దమ్మపేట మండలంలో సాగులో సుదీర్ఘ అనుభవం గల రైతులతో చర్చిస్తాం. సంబంధిత సమస్యలకు గల కారణాలను తెలుసుకుని వీలైనంత త్వరగా రైతులకు సమాచారం అందిస్తాం.

– చెన్నూరి సాయికృష్ణ, ఇన్‌చార్జ్ ఉద్యాన శాఖ అధికారి

అడ్మిషన్లకు 'అటానమస్' ఎర!

- రామచంద్ర డిగ్రీ కాలేజీలో అడ్మిషన్ల రగడ
- అటానమస్ ఆశచూపి సీట్ల కేటాయింపు
- అడ్మిషన్ల రద్దుపై భిన్న వాదనలు
- ప్రశ్నార్థకంగా కళాశాల ఉనికి



శ్రీరామచంద్ర కళాశాల

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామ చంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల వ్యవహారం తీవ్ర దుమారం లేపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నూతన ప్రవేశాలను కల్పిస్తోంది. ఆన్‌లైన్ ప్రక్రియ విధానంతో కౌన్సెలింగ్ పద్ధతిన విద్యార్థులకు సీట్లు కేటాయింపు ఉంటుంది. అయితే మొదటి మూడు దశల్లో రామచంద్ర డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అడ్మిషన్లు బాగానే జరిగాయి. చివరిదైన నాలుగో దశ ఈ నెల 20 నుంచి 31 వరకు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగనుంది.

అంతా సవ్యంగా ఉందనుకుంటే..

ఇప్పటివరకు సాఫీగా జరిగిన అడ్మిషన్ల ప్రక్రియతో అంతా సవ్యంగా ఉందనుకుంటున్న సమయాన అకస్మాత్తుగా పదుల సంఖ్యలో విద్యార్థులు వారి అడ్మిషన్లను వెనక్కు తీసుకోవడంపై కళాశాల సిబ్బందికి షాక్ గురయ్యారు. న్యాక్ బీ ప్లస్ పొందిన కళాశాల, అందులో ఎంతో చరిత్ర కలిగి విద్యా ప్రమాణాలకు పెద్దపీత వేసే సిబ్బంది ఉన్న కళాశాలను కాదని వారి అడ్మిషన్లు రద్దు చేయమంటూ స్వయంగా విద్యార్థులు కోరడం ఇప్పుడు పలు సందేహాలకు తావిస్తోంది.

అడ్మిషన్ల రద్దుపై భిన్నాభిప్రాయాలు..

కళాశాలలో అడ్మిషన్ల రద్దుపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కళాశాలకు చెందిన కీలక హోదాలో ఉన్న ఓ వ్యక్తి అడ్మిషన్ల రద్దును ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వార్థ ప్రయోజనం కోసం విద్యార్థుల భవిష్యత్‌తో చలగాటం ఆడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాల్వంచ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, శ్రీరామచంద్ర కళాశాలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే రామచంద్ర డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సెలవుల్లో ఉండడంతో ఆ స్థానంలో స్థానిక సిబ్బందిని కాకుండా ఇతర కాలేజీ వారిని ప్రిన్సిపాల్‌గా నియమించడం కళాశాల వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది సిబ్బంది ఇదేమీ తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుంటే, మరికొందరు మాత్రం కొత్తగా వచ్చిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నియామకమే అందుకు కారణమంటూ బాహాటంగానే చెబుతున్నారు. ఇది ఇలానే కొనసాగితే కళాశాల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని, తక్షణమే విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అశ్వాపురం ఫారెస్ట్ రేంజర్ సస్పెండ్

- పోడు భూమికి సంబంధించి లంచం తీసుకున్నారని ఆరోపణ
- విచారణ చేసి సస్పెండ్ చేసిన పీసీసీఎఫ్



సస్పెండ్ అయిన రేంజర్ రమేష్

అశ్వాపురం: అశ్వాపురం ఫారెస్ట్ రేంజర్ సిద్ధబొయిన రమేష్‌ను పీసీసీఎఫ్ గురువారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలోని చింతకుంట అటవీ ప్రాంతంలో సాగులో ఉన్న పోడు భూమికి సంబంధించి మల్లెలమడుగు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద ఓ మధ్యవర్తి రూ.లక్ష లంచం తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆరోపణలపై అటవీ శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయగా.. ఆరోపణలు రుజువు కావడంతో రేంజర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల అశ్వాపురం రేంజ్ పరిధిలో పోడు భూముల విషయంలో ఫారెస్ట్ అధికారులు లంచాలు తీసుకుంటున్నారని గిరిజనుల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని, ఇటువంటి అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి..

కారేపల్లి: ఆరవేసిన దుస్తులు తీసే క్రమాన విద్యుదాఘాతానికి గురైన మహిళ మృతి చెందింది. కారేపల్లి మండలం విశ్వనాథపల్లికి చెందిన బొగ్గారపు సరస్వతి(52) ఇంటి రేకుల షెడ్డులో కట్టిన జీ వైర్‌పై దుస్తులు ఆరేసింది. అయితే, షెడ్డు మీదుగా విద్యుత్ వైర్ వెళ్లడంతో జీ వైర్ గుండా విద్యుత్ ప్రసారమవుతున్నట్లు తెలిసింది. ఈమేరకు దుస్తులు తీసే క్రమాన సరస్వతి విద్యుదాఘాతానికి గురికాగా బట్టలు గట్టిగా లాగడంతో జీ వైరు తెగి మెడకు చుట్టుకుని తప్పించుకోలేక అక్కడే కుప్పకూలింది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. సరస్వతికి భర్త కిషన్‌రావు, ఓ కుమారుడు ఉన్నాడు.

పెళ్లి బట్టల కోసం వచ్చి అనంతలోకాలకు..

అశ్వారావుపేటరూరల్: పెళ్లి బట్టలు కొనుగోలు చేసి తన స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. స్థానిక ఎస్సై టి.యయాతీరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన సన్నేపల్లి సుబ్బారావు(48) కొద్ది రోజుల్లో తన బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో కుటుంబీకులకు కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట వచ్చాడు. అక్కడ బట్టలు కొన్నాక తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో అశ్వారావుపేట మండలం తిమ్మాపురం సమీపాన అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాల కాగా అదే సమయాన కూలీలతో వెళ్తున్న ఆటో డ్రైవర్ ఆపి బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన కొర్సా రామకృష్ణ(42) తన పొలం దగ్గర నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు.ఈ క్రమంలో మండలంలోని సూరారం గ్రామ శివారులో భద్రాచలం నుంచి చర్ల వైపు వస్తున్న ఆల్టో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రామకృష్ణకు తీవ్ర గాయాలు కాక స్థానికులు భద్రాచలం వైద్యశాలకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుమారుడు శ్రీరామ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై దాడి చేసిన ఘటనలో ఆరుగురు వ్యక్తులు పట్టుపడగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఎస్సై టి.యయాతీరాజు కథనం ప్రకారం.. మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం గ్రామ శివారులో ఉన్న పామాయిల్ తోటలో గురువారం కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. ఈమేరకు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.20,100 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముత్యాలమ్మనగర్‌లో 10మంది అరెస్ట్..

మణుగూరుటౌన్: మండలంలోని ముత్యాలమ్మనగర్ పంచాయతీలోని ఓ నివాసంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 10 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.56 వేలు 10 సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నాగబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ రంజిత్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

మణుగూరు టౌన్: రైల్వే శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల ఆశ చూపి డిగ్రీ కళాశాల విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగబాబు గురువారం తెలిపారు. మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 75 మంది విద్యార్థులకు రైల్వే విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని విశాఖపట్టణానికి చెందిన నరేంద్రకుమార్ పట్నాయక్ డబ్బు వసూలు చేశాడని, ఆ తర్వాత అందుబాటులో లేకుండా పోయాడని వెల్లడించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్లు సీజ్

కామేపల్లి: అనుమతి లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్న జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను పోలీసులు గురువారం సీజ్ చేశారు. కామేపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా శివార్లలో ప్రభుత్వ భూమి నుంచి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారని గుర్తించారు. ఈమేరకు జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి విచారణ కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

గురుకుల విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా



ప్యూరిఫయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత నీరు, ఆహారం కారణంగా 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయింది. దీంతో స్పందించి ఆరా తీయగా ఎలాంటి ఇబ్బంది లేదని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల వర్షంలో తడవడంతో 30 మంది విద్యార్థులకు జ్వరం రాగా కొందరు ఇళ్లకు వెళ్లారని తేలగా, మిగతా వారికి చికిత్స చేయించారు. ఉన్నతాధికారులు కాలేజీ ప్రిన్సిపాల్ అన్వేష్‌తో మాట్లాడడంతో బుధవారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో ఎలాంటి ఇబ్బంది లేదని తేలినట్లుగా చెప్పారు. అలాగే, కళాశాలను ఐడీఎస్‌పీ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పుల్లారెడ్డి, ఇమానియాల్ వంటగది, తాగునీటిని పరిశీలించి ఆహారం, తాగునీటిలో ఎలాంటి కలుషితం కాలేదని నివేదిక రూపొందించారు. ఇక గురుకులాల ఆర్‌సీఓ అలివేలు కూడా వివరాలు సేకరించారు. కాగా, విద్యార్థులకు అవసరమైన పరీక్షలు నిర్వహించిన వైద్యం చేయించాలని ఏఐఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వరక అజిత్ ఆధ్వర్యాన నాయకులు కళాశాలను సందర్శించి వివరాలు సేకరించారు.

తల్లి పాలే శ్రేయస్కరం..



తల్లిపాల వారోత్సవాల్లో ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్)

- నేటి నుంచి వారం పాటు అవగాహన కార్యక్రమాలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఇంటింటా ప్రచారం

పాల్వంచరూరల్: తల్లిపాల ప్రాముఖ్యతను చాటుతూ ప్రతీ ఏడాది ఐసీడీఎస్‌శాఖ ఆధ్వర్యాన వారం రోజులపాటు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఈ నెల 1 నుంచి 7 తేదీ వరకు నిర్వహించనున్నట్లు సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఇందులో భాగంగా తొలిరోజు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన ప్రదర్శనలు, బిడ్డ తినే పద్ధతులపై ప్రజల్లో అవగాహన కల్పించడం, రెండు, మూడో రోజున గర్భిణులు, తల్లులు, మహిళలు, పెద్దలతో తల్లిపాలు అనుబంధ ఆహారం ప్రారంభంపై అవగాహన, తల్లిపాల ప్రాముఖ్యతపై పోస్టర్ల ఆవిష్కరణ, ఉద్యోగ స్థలాల్లో తల్లిపాల కోసం ప్రవసీ కార్నర్ ఏర్పాటు, ఒక గంటలో తల్లిపాల ప్రారంభం గురించి అవగాహన కల్పించనున్నారు. అలాగే 4న అన్నప్రాశనపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం, 5న ఇళ్ల సందర్శన తల్లులకు తల్లిపాలు, అనుబంధం, ఫీడింగ్ ఫ్రీక్వెన్సీ, పిల్లలకు జన్మనివ్వడంపై కౌన్సెలింగ్, చివరగా 7న స్వయం సహాయక సంఘాలతో సమావేశమై పిల్లల ఆరోగ్యం, తల్లిపాలు, మహిళల సేంక్షేమంపై అవగాహన కల్పించనున్నట్లు సీడీపీఓ పేర్కొన్నారు.

ఇంటింటా అవగాహన..

తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఏడు రోజుల పాటు నిర్వహించనున్నాం. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఇంటింటా తిరిగి అవగాహన కల్పించి తల్లిపాల ఆవశ్యకతను వివరించనున్నాం. అంగన్‌వాడీ కేంద్రలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, బాలికలు, పిల్లలు, స్థానిక ప్రజలకు వివరించి జాగృతం చేస్తాం.– **లక్ష్మీప్రసన్న, సీడీపీఓ, పాల్వంచ**

జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. జీరో నుంచి మూడేళ్ల పిల్లల సంఖ్య 35,332 మంది, 3 నుంచి ఆరేళ్ల పిల్లలు 31,239 మంది, గర్భిణులు 8,775మంది, బాలింతలు 7,864 మంది ఉన్నారు. పాల్వంచలో 234 కేంద్రాలు ఉండగా.. 991 మంది గర్భిణులు, 752 తల్లులు, ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సు కలిగిన పిల్లలు 4,324 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు కలిగిన పిల్లలు 3,751 మంది ఉన్నారు. ఆయా కేంద్రాల పరిధిలో వారం రోజుల పాటు అవగాహన కల్పించి జాగృతం చేయాలని ఐసీడీఎస్ శాఖ నిర్దేశించింది. ప్రధానంగా బిడ్డలకు డబ్బాపాలు కాకుండా తల్లిపాలే ఇవ్వాలని జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు.